క్రీడ.. ఓ కల..!

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- క్రీడలకు అనువుగా లేని మైదానాలు
- ఇటీవల క్రీడాపరికరాలు మంజూరు

యువ క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని, దేశానికి ప్రాతినిథ్యం వహించి తల్లిదండ్రులతో పాటు తమ గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలని కలలు కంటారు. కానీ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా యువత క్రీడలు ఆడటమే ఓ కలగా మారింది. ఏమాత్రం అనువుగా లేని స్థలాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయ దంతో యువతీ, యువకులు ఆటలు ఆడలేక ఇబ్బందులు పడుతున్నారు.



మోతుగూడలో బురదమయంగా క్రీడాప్రాంగణం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని యువతీ, యువకులకు క్రీడలు ఓ కలగా మారాయి. పల్లెల్లో, పట్టణాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెలంగాణ క్రీడా పాంగణాలు ఏర్పాటు చేసినా అవి నిరుపయోగంగా మారాయి. ఆదిలో అధికారులు హడావుడి చేసి ఎక్కడ ఖాళీ స్థలం కన్పిస్తే అక్కడ క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి మమ అనిపించారు. ఆయా స్థలాల్లో క్రీడలు ఆడుకునే పరిస్థితి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. రాళ్లు, రప్పలు నిండి, చెత్తాచెదారంతో క్రీడా ప్రాంగణాలు దర్శనమిస్తున్నాయి. కాగా ప్రభుత్వం ఇటీవల ఆయా క్రీడా ప్రాంగణాల్లో ఆడుకునేందుకు క్రీడాకారుల కోసం క్రీడా పరికరాలు మంజూరు చేసింది.

మండలంలో 27 జీపీలు..

మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో క్రీడలు ఆడుకునేందుకు 15 నుంచి 20 గుంటల కంటే ఎక్కువ స్థలం ఉన్న జీపీలు 15 మాత్రమే ఉన్నాయి. మిగతా వాటికి స్థలం లేక పాఠశాల మైదానాల్లో ఏర్పాటు చేశారు. ఇవి ఇరుకుగా ఉండడంతో క్రీడలు ఆడలేని పరిస్థితులు ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భూమి ఉన్నా కబ్జాలో ఉండటంతో క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయించలేకపోతున్నారు. ఈదులవాడ, గోవింద్‌పూర్, రహపల్లి, మోతుగూడతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయి. సర్పంచ్‌లు కూడా ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎవరిని ఏం అనలేని పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

క్రీడా పరికరాలు మంజూరు..

క్రీడా ప్రాంగణాల కోసం 937 క్రీడాయూనిట్లు ఇటీవల జిల్లాకు చేరుకోగా వాటిని మండల పరిషత్ కార్యాలయాల్లో పంపిణీ చేశారు.ఒక్కో యూనిట్‌లో క్రికెట్, వాలీబాల్ కిట్లు, టీ షర్టులు, మూడు జతల డంబల్స్ వంటి ఎన్నో క్రీడా పరికరాలు ఉన్నాయి. వీటిని త్వరలోనే ఆయా పంచాయతీలకు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. క్రీడా పరికరాల కంటే ముందు క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

డీహెచ్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం


ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో అత్యంత కీలకపాత్ర పోషించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, లేకుంటే ఈనెల 12న డీహెచ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. మధుకర్, సదాలక్ష్మి, సదానందం, శ్రీదేవి, మమత, రజిత, వెంకటేష్, విజయ, సంగీత, లింగన్న పాల్గొన్నారు.

పొలాల అమావాస్య సందడి


సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

సిర్పూర్(టి): మండలంలో పొలాల అమావాస్య పండుగ సందడి నెలకొంది. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వారసంతలో శనివారం రైతులు పండుగ సామగ్రితో పాటు ఎడ్ల అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు. ఈనెల14న రైతులు అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగ నిర్వహించనున్నారు.

'అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది'

బెజ్జూర్: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని ఎస్సై విక్రమ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు రక్తదాన శిబిరంలో ఉదయం 11 గంటలకు పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు.

నేడు టెట్ పేపర్ 1 నమూనా పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెట్ పేపర్ 1 (చివరి మోడల్ టెస్ట్ 5) నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిపుణుల ఆధ్వర్యంలో నమూనా పరీక్ష పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. అభ్యర్థులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు పట్టణంలోని వాసవీ భవన్‌లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం బాలాజీ, లింగమూర్తి, పవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న రాజేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం, జీవో 51 సవరింపు, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేపట్టగా మంత్రి హామీతో తాత్కాలికంగా విరమింపజేసినట్లు తెలిపారు. కానీ నేటికీ హామీలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. శ్రీకాంత్, మట్ట రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వంటావార్పు


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరసనదీక్షలు శనివారం 13వ రోజుకు చేరుకున్నాయి. కలెక్టరేట్ సమీపంలో పీటీఐలు కాళోజి చిత్రపటాన్ని గీసి జయంతి జరిపారు. అనంతరం వంటావార్పు చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు అజ్మీర శ్యాంనాయక్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. రాష్ట్ర మానవ హక్కుల సంఘం కార్యదర్శి ఆత్రం భుజంగరావు, టీపీటీఎఫ్ అధ్యక్షుడు కనక వెంకటేశ్, ఆత్రం మెహపత్ రావు, నాయకులు శ్యాంరావు, ఆత్రం సుగుణ, రాధాకృష్ణాచారి, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి నగేశ్, గెడేకర్ సంతోష్‌కుమార్, పవన్, దుర్గం సందీప్, సత్యనారాయణ, స్రవంతి, భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

రెబ్బెన: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈనెల 11 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో జేఏసీ సంఘాలతో జరిపిన చర్చల్లో మంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, సీఐటీయూ మండల నాయకులు సిద్దెంకి సత్తయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు తిరుపతమ్మ, బాలమ్మ, శ్యామల, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

21 వరకు అడ్మిషన్లు

రెబ్బెన: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లకు అపరాధ రుసుముతో ఈనెల 21వ వరకు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు రెబ్బెన జెడ్పీ హైస్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు మేడి చరణ్‌దాస్, అనీస్ అహ్మద్‌లు తెలిపారు. బడి మధ్యలో మానేసిన 14 సంవత్సరాల పైబడిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9491460670లో సంప్రదించాలని కోరారు.

అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కృషి చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకుడు

కౌటాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ శనివారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు కాగజ్‌నగర్‌లో బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందజేస్తున్నామని, ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆంజనేయులు, రవీందర్, రాందాస్, మోతీలాల్ నాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యాలయ ప్రారంభం వాయిదా

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం నిర్వహించాల్సిన నూతన బీఎస్పీ మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్యాలయాన్ని ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బోథ్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. సర్పంచ్ సురేందర్, పద్మశాలి సభ్యులు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో మందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సదాశివ్, మెరుగు భోజన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'భగీరథ' ఉద్యోగుల సమ్మె


ధర్నాలో పాల్గొన్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌లు అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారం 8వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి


విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కౌటాల: గ్రామీణ విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆరెకుల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డోకె దామోదర్ అన్నారు. బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికైన గుడ్లబోరి గ్రామానికి చుందిన ఉపాసే బాబాజీ–కమల దంపతుల కుమారుడు అశోక్‌తోపాటు ఎంబీబీఎస్‌లో సీటు పొందిన తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన నాగపురే తిరుపతి –అరుణ దంపతుల కుమారుడు కార్తీక్‌ను శనివారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నారులే రాందాస్, కార్యదర్శులు జల్కరి చంద్రశేఖర్, చౌదరి అంజన్న, జ్ఞానేశ్వర్, నాయకులు వసంత్‌రావు, శ్యాంరావు, బండు, తుల సీరాం, యాదవ్, విలాస్ పాల్గొన్నారు.

సిర్పూర్ బీజేపీ టికెట్ కోసం దరఖాస్తులు


దరఖాస్తు అందజేస్తున్న సేర్ల మురళీధర్


దరఖాస్తు చేసుకుంటున్న సప్ప శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ శనివారం పలువురు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారు. సిర్పూర్ టికెట్ కోసం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లా నాయకుడు మందాడే సుధాకర్‌లు వేర్వేరుగా దరఖాస్తులు చేసుకున్నారు.

ఆసిఫాబాద్: సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేపీ నుంచి టికెట్ కోసం జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ ఉపాధ్యక్షుడు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన సేర్ల మురళీధర్, వాంకిడికి చెందిన భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తమకు పార్టీ టికెట్ కేటాయించాలని వారు కోరారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ బీజేపీ నుంచి తనకు కేటాయించాలని మోతుగూడ గ్రామానికి చెందిన సప్ప శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆరెకుల సంఘం తరపున తనకు టి కెట్ కేటాయించాలన్నారు. ఆరె మరాఠా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గార్లె, ఆరె మరాఠా యువజన రాష్ట్ర అధ్యక్షుడు బాజీరావ్ బోస్లెలతో కలిసి దరఖాస్తు అందజేసినట్లు పేర్కొన్నారు.


దరఖాస్తు సమర్పిస్తున్న కొంగ సత్యనారాయణ


దరఖాస్తు అందజేస్తున్న ఎలగతి సుచిత్

ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి


కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పెందూర్ మోతీరాం, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో శనివారం కాళోజి నారాయణ రావు జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఆధ్వర్యంలో కాళోజి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తాం

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తామని డీసీసీ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శనివారం మావల మండలంలోని వాఘాపూర్ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 6 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. దళితబంధు తరహాలో అంబేద్కర్ అభయహస్తం కింద అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీల అభివృద్ధికి నాలుగు ఐటీడీఏలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

చీర చుట్టిన చేను..!



బెజ్జూర్: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతులకు పంట రక్షణ సవాల్‌గా మారింది. అటవీ ప్రాంత సమీపంలో పంట పొలాలు ఉన్న రైతులు అడవి పందుల భారీ నుంచి పంటలను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. మండలంలోని ఎలుకపెల్లి, సిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్ గ్రామాలకు చెందిన రైతులు రాత్రివేళ కాపలా వెళ్లి పంటలను రక్షించుకోవడం ఇబ్బందిగా ఉందని చేను చుట్టూ చీరలతో కంచెలు ఏర్పాటు చేశారు.

సమస్యల్లో 'శివపెల్లి'..!

- కనీస సౌకర్యాలకు నోచుకోని గ్రామం
- తాగునీరు, రోడ్డు సౌకర్యం కరువు


నిరుపయోగంగా ఉన్న నీళ్ల ట్యాంకు


శివపెల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగు

చింతలమానెపల్లి: ఆదివాసీ పల్లెలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. అనేక సమస్యలు గ్రామాల్లో రాజ్యమేలుతున్నాయి. మండలంలోని శివపెల్లి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయింది. కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేదు..

శివపెల్లి గ్రామం చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం. ఈ గ్రామం చింతలమానెపల్లి నుంచి గూడెం గ్రామానికి చేరుకునే ప్రధాన రహదారి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామానికి మట్టిరోడ్డు ఉండగా మార్గంలో రెండు వాగులు ఉన్నాయి. రోడ్డంతా వర్షాకాలంలో బురదమయంగా మారుతోంది. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లకపోవడంతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెనలు లేక ప్రమాదకరంగా వాగులు దాటాల్సిన పరిస్థితి ఉంది.

పూర్తిగా ఆదివాసీలే..

రెండు అనుబంధ గ్రామాలుగా ఉన్న శివపెల్లిలో మొత్తం 450 మంది నివసిస్తున్నారు. వీరి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ నీటి సరఫరా చేయడం లేదు. తాగునీటి కోసం గ్రామస్తులు చేతిపంపుపైనే ఆధారపడుతున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా పాఠశాల చుట్టూ మురికి నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలో నాణ్యత లేకుండా అంతర్గత రహదారులు నిర్మించడంతో అధ్వానంగా మారాయి.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..

గ్రామంలో సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుండడంతో అత్యవసర సమయంలో కూడా గ్రామం దాటలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రేషన్ దుకాణం లేదని, ఓటు వేయడానికి సైతం తాము గూడెం గ్రామానికి వెళ్తున్నామని, తమ ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి రహదారితో పాటు వాగులపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

తిప్పలు పడుతున్నాం



మా గ్రామంలో కనీస వసతులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నాం. గ్రామంలో తాగునీటి వసతి కూడా లేదు. బోరింగ్ నీళ్లే తాగుతున్నాం. కరెంట్ కూడా రోజుల తరబడి ఉండదు. అధికారులు కూడా మా గ్రామానికి రావడం లేదు.

– ఎన్క మంజుల, శివపెల్లి

రహదారి నిర్మించాలి



మా గ్రామానికి గూడెం నుంచి రోడ్డు నిర్మించాలి. వాగులపై వంతెనలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే ఊరు దాటలేని పరిస్థితి మాది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి.

–మల్లేష్, శివపెల్లి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎదులాపురం: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు హజార్ అన్నారు. పట్టణంలోని వరలక్ష్మినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.